ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలేనా ? గల్లీలో రైతుల కన్నీళ్లు పట్టవా?

ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ పంటనష్టంపై లేదేం ?

సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలేనా ? గల్లీలో రైతుల కన్నీళ్లు పట్టవా ? అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతులంటే చిన్నచూపు ఎందుకని, పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి పంటనష్టంపై లేదెందుకని ఆయన బుధవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సీఎంను నిలదీశారు. 'నిన్న పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదు, నేడు వడగండ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడలేదు. అన్నదాతల ఆర్తనాదాలు వినిపించవా..?' అని నిప్పులు చెరిగారు. 'ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదా..?' అని ధ్వజమెత్తారు. 'నీట్లు ఓట్ల పంచాయితీయే తప్ప.. అన్నదాతల ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా ? ' అని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే.. 24/7 ఫక్తు రాజకీయమేనా? దెబ్బతిన్న పంటలను పరిశీలించే తీరిక లేదా ? అని ప్రశ్నించారు. హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా ? అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇంతకాలం పచ్చని పైర్లు ఎండుతున్నా..సాగు నీరు ఇవ్వడం చేతకాలేదని, ఇప్పుడు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్నా మనసు రావడం లేదా ? అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

బుధవారం ప్రమాణ స్వీకారం అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న గవర్నర్ రాధాకృష్ణన్. ఆలయ ప్రాంగణంలో గవర్నర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సీఎస్ శాంతికుమారి

కొలువుదీరిన కొత్త గవర్నర్

మొదటిపేజీ తరువాయి...

రాధాకృష్ణన్ కితాబునిచ్చారు. బుధవారం ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ కుటుంబ సమేతంగా యాదగిరిగుట్టకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన ఆయనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ హనుమంత్ కే జెండగే, ఈవో భాస్కర్ రావు ఘనస్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వచనం చేయగా ఆలయాధికారులు మహాప్రసాదంతోపాటు స్వామి చిత్రపటాన్ని అందచేశారు. ఆలయంలోకి రాగానే భక్తి భావం ఉప్పొంగిందని మీడియాతో గవర్నర్ అన్నారు.

లోకం పోకడ



బడికెళ్తే అబ్సెంట్ వేస్తారట.. మోదీషోకి వెళ్తేనే అటెండెన్స్‌అట!

రైతులవారీగా పంటనష్టం సర్వే

అధికారులకు తుమ్మల ఆదేశం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతుల వారీగా పంటనష్టం సర్వే నిర్వహించాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే సీఎం ఆదేశాల మేరకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని స్పష్టంచేశారు. బుధవారం పంట నష్టంపై ఆయన మాట్లాడుతూ... రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు.

కరువు, వలసల నివారణపై ఎఫ్ఏవో ఫోకస్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కరువును తట్టుకొని ఎలా నిలబడాలి, వలసలను ఎలా నియంత్రించాలనే అంశంపై ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏవో) చర్యలు చేపట్టింది. ఈ అంశంపై నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలుకు ఇటీవల వ్యవసాయ శాఖతో కలిసి నిర్ణయించింది. తొలి దశలో ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు ఆదిలాబాద్, నారాయణపేట్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలను ఎంపిక చేసుకున్నది. ఈ జిల్లాల్లోని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నది. ముఖ్యంగా ఒకే ఆదాయ వనరుపై ఆధారపడకుండా వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వనున్నది. కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ ప్రజలు ఆర్థిక ఇబ్బందులను అధిగమించేలా వారికి తర్ఫీదు ఇవ్వనున్నది.

నీళ్లియ్యరు.. పంటలెట్ల?

- రైతంటే పట్టదు.. ఇదేం సర్కార్?
- సమీక్ష నిర్వహించి రైతులకు పంట నష్టపరిహారం అందించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డిమాండ్
- మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో క్షేత్రస్థాయిలో ఎండిన పంటల పరిశీలన

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, మార్చి 20 : నీళ్లియ్యరు.. పంటలను కాపాడరు? ఇదేమి సర్కార్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన పంట పొలాలను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, రైతులతో కలిసి జగదీశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కండ్ల ముందు పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని, పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు తాగునీటి పేరుతో పంట పొలాలకు సాగునీరు ఇచ్చి లక్షలాది ఎకరాలను కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు ఎస్ఎల్‌బీసీ, ఎడమ కాల్వ చివరి భూములకు కూడా నీరందించినట్టు చెప్పారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి పొలానికి కూడా నీరు అందని పరిస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి, ప్రేమ లేదని.. ఒక వేళ ఉంటే నీరు ఇచ్చి ఆదుకునేవారని తెలిపారు. కనీసం రెండు తడులకైనా నీరందిస్తే పంటలు చేతికొచ్చేవని పేర్కొన్నారు. పంటలు పండితే రైతులకు రూ.500 ఇవ్వాల్సి వస్తుందనే సాకుతోనే నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, కనీసం జిల్లా మంత్రులకు కూడా సోయి లేకుండా పోయిందని విమర్శించారు. గుళ్లు, గోపురాలు తిరగడం మంచిదే కానీ, పక్కనే ఎండిపోతున్న పంట పొలాలను కూడా పరిశీలిస్తే బాగుండేదని సూచించారు. పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతే ప్రభుత్వం కానీ, జిల్లా మంత్రులు కానీ పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

డబ్బులు ఢిల్లీకి పంపడమే తెలుసు

ఈ ప్రభుత్వానికి, మంత్రులకు ఇసుకదందా చేయడం, డబ్బులు వసూలు చేయడం, ఢిల్లీకి పంపడం మాత్రమే తెలుసని జగదీశ్‌రెడ్డిఎద్దేవా చేశారు. ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు ద్రోహం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతులను ఆదుకునేందుకు జిల్లా స్థాయిలో సమీక్ష జరిపి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ తదితరులు ఉన్నారు.

వంద రోజుల్లోనే గందరగోళం!

మొదటిపేజీ తరువాయి...

మంత్రి, ఎమ్మెల్యే వారికి భరోసా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. నిరుడు అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటే వికారాబాద్, వరంగల్ జిల్లాలో స్వయంగా తాను, కేసీఆర్ పర్యటించి రైతులకు ధైర్యం కల్పించామని గుర్తు చేశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఎకరానికి రూ.2000-రూ.2500 కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి లేదని, రైతుకన్నా మించినవాడు లేరని, ఎకరాకు రూ. 10 వేల పంట సాయం అందించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకే రోజు రూ. 1300 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఇస్తే, బిచ్చం వేస్తున్నారా అంటూ ఇదే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు అన్నారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. మరి ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే మాటపై నిలబడితే రూ.10వేల కంటే ఎక్కువ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వంద రోజుల్లో అతలాకుతలం

వంద రోజుల్లో వ్యవసాయాన్ని అతలాకుతలం చేశారని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు తిరిగి వచ్చి వ్యవసాయం చేసే పరిస్థితి కల్పిస్తే, కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం వద్దు అనే పరిస్థితులు కల్పించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు ఇదేనా ? అని ప్రశ్నించారు. జలాశయాల్లో ఉన్న నీళ్లను అంచనా వేసి రైతుల పంటల సాగుకు సూచన చేయమంటే ఒక్కనాడు ఈ ప్రభుత్వం సమీక్ష చేయలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే దురుద్దేశంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. కేసీఆర్ అప్పులు చేశాడని అభాండాలు వేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులకే రూ.16,400 కోట్లు అప్పు చేసిందని ఎద్దేవా చేశారు.

నిరుద్యోగులకు మొండిచేయి

అరచేతిలో స్వర్గం చూపి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిరుద్యోగులకు మొండిచేయి చూపుతున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ సర్కారు ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. గ్రూప్ 1,2,3, డీఏవో, ఎస్‌డబ్ల్యూవో, డీఎస్సీలో 5 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు కేసీఆర్ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టినవేనని గుర్తు చేశారు. కానిస్టేబుల్, స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు కూడా గత ప్రభుత్వానివేనని, కాంగ్రెస్ వచ్చి నియామక పత్రాలు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు అని యువతకు మొండిచేయి చూపారని అన్నారు. 21 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేసిన పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 11 వేల ఉద్యోగాలనే ఎందుకు ప్రకటించారని నిలదీశారు. 46 జీవోను వారం రోజుల్లో రద్దు చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని, యువత దీనిని గమనించాలని సూచించారు. రెండు లక్షల ఉద్యోగాలలో కేసీఆర్ ప్రభుత్వం 1.60 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, మిగిలిన 40 వేలు వివిధ స్థాయిల్లో ఉన్నాయని చెప్పారు. నిజం చెప్పడానికి ధైర్యం ఉండాలని, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, యువత అప్రమత్తంగా ఉండాలని నిరంజన్‌రెడ్డి సూచించారు.

అభిషేక్ బోయినపల్లికి బెయిల్

షరతులతో మంజూరు చేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన అభిషేక్ బోయినపల్లికి ఊరట లభించింది. 19 నెలల నుంచి జైలులో ఉన్న ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఈమేరకు సుప్రీం కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న అభిషేక్ భార్యకు చికిత్స చేయించేందుకు వీలుగా సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. ఇదే సమయంలో అభిషేక్ పాస్‌పోర్టును సరెండర్ చేయాలని, ఆయన భార్యకు హైదరాబాద్‌లోనే చికిత్స చేయించాలని షరతులు విధించింది. బెయిల్‌పై విడుదలయ్యే ముందు అభిషేక్ తన మొబైల్ నంబర్‌ను ఈడీ అధికారులకు ఇవ్వాలని, తనకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈడీ అధికారులకు తెలియజేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం స్పష్టం చేసింది.

నాలుగో రోజూ కవితను ప్రశ్నించిన ఈడీ

ఈడీ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అధికారులు నాలుగో రోజు కూడా విచారించారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, న్యాయవాది మోహిత్ రావు బుధవారం సాయంత్రం కవితను కలిశారు.

కవిత వ్యక్తిగత సిబ్బంది విచారణ..

కవిత వ్యక్తిగత సిబ్బంది రాజేశ్, రోహిత్‌లను బుధవారం ఈడీ అధికారులు విచారణకు పిలిచారు. కవిత అరెస్టు సమయంలో వారు ఆమె నివాసంలోనే ఉన్న విషయం తెల్సిందే. కవిత అరెస్టు సందర్భంగా వారి ఫోన్లను కూడా ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లను బుధవారం వారి సమక్షంలోనే అన్‌లాక్ చేశారు. అనంతరం పలు అంశాలపై వారిని ప్రశ్నించినట్టు తెలిసింది.

కవిత పిటిషన్‌పై రేపు విచారణ

ఈడీ అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఈ నెల 22న సుప్రీంకోర్టు విచారణ జరిపే అవకాశం ఉన్నది. జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం కవిత పిటిషన్‌పై విచారణ జరుపనున్నది.

పంట ఎండిందని రైతు రోదన

- కాళేశ్వరం నీళ్లు రాక ఎండుతున్న వరి పొలాలు
- దుబ్బతండాలో ఎండిన పంటను పట్టుకొని బోరుమన్న అన్నదాత

రైతు నర్సింహ

సూర్యాపేట రూరల్, మార్చి 20: కాల్వ నీళ్లు వస్తాయనుకొని వరి సాగు చేసిన రైతులకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. కనీసం బోర్లు, బావులు ఆదుకుంటాయన్న దశలో.. అవీ ఎండిపోవడంతో పొట్టకొచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయి. ఫలితంగా అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు.. దిక్కుతోచని స్థితిలో ఎండిపోతున్న పైర్లను చూస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందుకు.. బుధవారం సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామ ఆవాసం దుబ్బతండాకు చెందిన ధరావత్ నర్సింహ.. ఎండిపోతున్న తన వరిపంటను చూసి కన్నీరుపెట్టుకున్న ఉదంతమే ఉదాహరణ. నర్సింహ తనకున్న అర ఎకరం భూమికి తోడు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలతో నాలుగున్నర ఎకరాల భూమిని సాగు చేస్తూ కారుకు సుమారు 20 పుట్ల వడ్లు పండించాడు. ఇప్పుడు ఎస్సారెస్పీ నీళ్లు రాక పోవడంతో సాగుచేసిన మొత్తం పంట పొట్ట దశకు వచ్చేసరికి ఎండిపోయింది. పంటలు పండకున్నా భూమి యజమానికి కౌలు కింద ఎకరానికి రూ.14 వేలు ఎలా ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చెందుతూ.. ఎండిన పొలంలో పడి బోరున ఏడ్చాడు. ఇప్పటికే పంటలు సాగు చేసేందుకు రూ.50 వేలు పెట్టుబడి ఖర్చు చేసినట్టు వాపోయాడు. ఎస్సారెస్పీ కాల్వ కింద తండా రైతులు పెద్ద మొత్తంలో పంటలు సాగు చేయగా.. నీళ్లు రాకపోవడంతో ఎండిపోయినట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతును కబళించిన కరెంట్

- ఈదురు గాలులకు తెగిపడ్డ తీగ
- గమనించకుండా వైర్ తొక్కడంతో షాక్
- పెద్దపల్లి జిల్లా కనగర్తిలో విషాదం

గుండారం రాజయ్య (ఫైల్)

ఓదెల, మార్చి 20: ఈదురు గాలులకు తెగిపడ్డ విద్యుత్తు తీగ ఓ కౌలురైతును పొట్టన పెట్టుకున్నది. పొలం ఒడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తూ గమనించకుండా వైర్‌పై అడుగేయడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండారం రాజయ్య (62) ఓ రైతు వద్ద రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. మంగళవారం రాత్రి బలంగా ఈదురు గాలులు వీయడంతో కరెంట్ వైర్లు తెగి ఒడ్డుపై పడ్డాయి. రోజులాగే రాజయ్య పొలాన్ని చూసేందుకు ఒడ్డు పైనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, ఒడ్డు పైన ఉన్న కరెంట్ వైరు అతడి కాలుకు తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురై మరణించాడు. మృతుడికి భార్య. ఇద్దరు కొడుకులు, బిడ్డ ఉండగా ఇటీవలే ఓ కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతోనే రాజయ్య మరణించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఘటనా స్థలానికి వచ్చిన సిబ్బందిని నిలదీశారు. కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ అరెల్లి మొండయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యుత్తు షాక్‌తో ఒకరి మృతి

బావిలో పూడిక తీస్తుండగా ఘటన

కేసముద్రం, మార్చి 20: బావిలో పూడిక తీస్తుండగా విద్యుత్తు షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని బేరువాడ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ రైతు తన బావిలో నీరు అడుగంటడంతో పంటలకు నీరందించాలని క్రేన్ సహాయంతో బావిలో పూడిక తీయిస్తున్నాడు. పూడిక తీయడానికి అదే గ్రామానికి చెందిన బానోత్ రమేశ్ (42) కూలికి వచ్చాడు. బావిలో ఉన్న విద్యుత్తు మోటర్ ఆన్ కాకపోవడంతో రమేశ్ మోటర్‌ను మరమ్మత్తు చేస్తుండగా కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు.

రాష్ట్రానికి ఎల్లో అలర్ట్

- మరో రెండు రోజులు వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే రెండ్రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాలో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఎక్కువ ఆస్కారం ఉన్నదని, ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో మోస్తరు వానలు పడొచ్చని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు అధికారులు ఎల్లోఅలర్ట్ జారీచేశారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో పాటు పిడుగులు పడే ప్రమాదమున్నదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. హైదరాబాద్‌లోనూ వర్షాలు కురిసే చాన్స్ ఉందని, ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు ఉదయం పొగమంచు పడొచ్చని పేర్కొన్నది. ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్రలో అల్లూరి, అంబేద్కర్ కోనసీమ, తూ.గో., ఏలూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు, మిలిగిన చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది.

మంగళవారం యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, రంగారెడ్డి, జనగామ, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షం పడింది. హైదరాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కుమ్రంభీం జిల్లాలోని నెల్లిలో 2.7, ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 2.1, సిరికొండలో 2, పిప్పల్దారిలో 1.8, జైనథ్‌లో 1.7, ఆదిలాబాద్‌లో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. అకాలవర్షాలతో మామిడి, బత్తాయి, నిమ్మ వంటి ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరుగుతున్నది. మొక్కజొన్న, వరి వంటి పంటలు వడగండ్లతో నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండం గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా

కేంద్రమంత్రి సభలో కరెంట్ కట్

తాంసి, మార్చి 20: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి, ఉండం గ్రామాల్లో కేంద్ర మంత్రి అర్జున్ ముండా పర్యటించారు. బుధవారం ఉండం గ్రామంలో ఆయేషా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతుండగా కరెంటు పోయింది. ముందుగా ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతుండగా మైక్ సరిగా పనిచేయలేదు. కాంగ్రెసోళ్లు కరెంట్ కట్ చేశారంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు విమర్శించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతుండగా అరగంటకుపైగా కరెంట్ కట్ కావడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నది. చివరకు జనరేటర్ల సాయంతో కార్యక్రమాన్ని కొనసాగించారు.

చార్జిషీట్‌లతో కాలయాపనా?

మొదటిపేజీ తరువాయి...

కనుసన్నల్లో ఈడీ పనిచేస్తున్నదంటూ ప్రతిపక్షాలు విమర్శలు కురిపిస్తున్న సమయంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అక్రమ మైనింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ సన్నిహితుడు ప్రేమ్‌ప్రకాశ్‌ను 2022 ఆగస్టులో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. మనీలాండరింగ్, ఆయుధ చట్టాల కింద పలు కేసులు నమోదు చేశారు. దీంతో గడిచిన 18 నెలలుగా ప్రకాశ్ జైల్లోనే ఉన్నారు. నిందితుడు కింది కోర్టులో డీఫాల్ట్ బెయిల్ కోసం ప్రయత్నించినప్పటికీ, అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తూ ఈడీ అధికారులు విచారణను పొడిగిస్తున్నారు. దీంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఏమిటీ డీఫాల్ట్ బెయిల్?

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం.. నిర్దేశించిన గడువులోగా అధికారులు దర్యాప్తు పూర్తి చేయకపోయినా, లేదా తుది చార్జిషీటు దాఖలు చేయకపోయినా.. అప్పటికే అరెస్టయిన వ్యక్తి డీఫాల్ట్ బెయిల్ పొందేందుకు అర్హుడిగా పేర్కొంటారు. దర్యాప్తు గడువును సాధారణంగా 60 లేదా 90 రోజులుగా నిర్ణయిస్తారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకూ తమకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాల్సిందిగా కూడా డీఫాల్ట్ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.